క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వరుని సేవలో ఎమ్మెల్సీ రవీంద్ర



ఎమ్మెల్సీ వంక రవీంద్రకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి విచ్చేసిన రవీంద్రకు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం క్షీరారామలింగేశ్వర స్వామి, జనార్దనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మ వార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద ఆశీర్వచనం అందజేశారు. చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు రవీంద్రకు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, చిత్రపటాన్ని అందజేశారు. రవీంద్ర పుట్టినరోజు కావడంతో పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద శాలువ కప్పి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చందక సత్తిబాబు, బాకూరి నిరంజన్, మోర్త గిరీష్, ఇజ్జాడ చినబాబు, గంటా నరేష్, జమ్ము కాశి, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం

పెనుగొండ: గ్రామంలోని భవానీ పీఠంలో గురు భవానీలు పిల్లి శంకరం, నక్కా వేద వ్యాస శాస్త్రిల ఆధ్వర్యంలో 34వ సంవత్సర మహాగణపతి హోమం, చండీ హోమం, మహాలక్ష్మీ హోమాలు వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి పీఠంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హోమాన్ని జోశ్యుల సుబ్బారావు, జోశ్యుల వెంకటరామ్‌ల పర్యవేక్షణలో శిష్యబృందం వేద మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీకేపీ విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కేఆర్ రాజు, డాక్టర్ కలిదిండి అన్నపూర్ణలను భవానీ మాలధారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముత్యాల మురళీ, కుక్కిరి రవి, గుబ్బల దామోదర్, ఆదిరెడ్డి, సందీప్, పాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

'ఆడుదాం ఆంధ్ర'తో యువతలో జోష్



ఉండి: మహాదేవపట్నంలో వాలీబాల్ ఆడుతున్న యువతులు



వీరవాసరం: రాయకుదురులో బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



కాళ్ల: సీసలిలో కబడ్డీ ఆడుతున్న యువకులు



కాళ్ల: కోపల్లె హైస్కూల్లో కబడ్డీ ఆడుతున్న యువతులు

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం మండలంలోని ఉండి, మహాదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం, యండగండి, ఉప్పులూరు, చెరుకువాడ గ్రామాల్లో సచివాలయ పరిధిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలను సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పర్యవేక్షించారు. మండలంలోని 21 సచివాలయల నుంచి యువతీ యువకులు రెండేసి జట్లు పాల్గొనడంతో పోటీలు ఆసక్తిగా మారాయి. క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

వీరవాసరంలో...

వీరవాసరం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం వీరవాసరం, రాయకుదురు, తోలేరు, కొణితివాడ, మత్స్యపురి, అండలూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాల్లో బ్యాడ్మింటన్ పోటీలను పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను గుర్తించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో వారిని నిలిపేలా ఉంచడమే ప్రధాన ఉద్దేశంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. క్రీడాకారులను ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, సర్పంచులు గెడ్డం భారతి, చికిలే మంగతాయారు, బిశెట్టి లక్ష్మి, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, నూకల కనకారావు, వీరవల్లి కనక ఉషారాణి, బోను జ్యోష్ణ దేవి తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో...

కాళ్ల: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం మూడో రోజు కబడ్డీ పోటీల్లో యువతీ యువకులు పాల్గొనేందుకు ఉత్సాహం చూపారు. కాళ్ల మండలం ఏలూరుపాడు, కాళ్ల, కలవపూడి, సీసలి, కోపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామల పరిధిలో ఉన్న 21 సచివాలయాల్లో 40 జట్లు కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాయి. సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు సమక్షంలో క్రీడలు నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

నరసాపురం: జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్ జయరాజు దంపతులు గురువారం కలెక్టరేట్‌లో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. పుష్పగుచ్ఛం అందించి, జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలరాముడి విజయయాత్ర

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో అయోధ్య వెళ్తున్న బాలరాముడి విజయ యాత్ర వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి స్థానిక గజలక్ష్మి సెంటర్ కంచికామాక్షమ్మ ఆలయం గీతామందిరం వద్దకు బాలరాముడి విజయయాత్ర చేరుకుంది. పట్టణ ధర్మపరిరక్షణా సమితి అధ్యక్షులు గాదె వెంకన్న ఆధ్వర్యంలో భక్తులు బాలరాముడికి పూజలు చేసి హారతులు ఇచ్చి ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో తులా రామలింగేశ్వరరావు, కేవీఎల్ నరసింహరాజు, జక్కంపూడి కుమార్, అంబటి రాజు పాల్గొన్నారు.

క్రిస్మస్ ప్రార్థనలు

నరసాపురం రూరల్: క్రీస్తు పుట్టుక లోకోద్ధరణ కోసమే జరిగిందని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని వేములదీవి వెస్ట్ గ్రామంలోని మురాలపేటలో సీయోను ప్రార్థనా మందిరంలో పాస్టర్ మురాల సత్యానందం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్రిస్మస్ ఆరాధనా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు జననానికి సంబంధించిన సన్నివేశాలను చిన్నారులు ప్రదర్శించారు.

వైట్ల కిషోర్‌కు సత్కారం

పెనుగొండ: యువ కళావాహిని ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ఆచంటకు చెందిన ప్రముఖ రచయిత, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైట్లకిషోర్‌ను సినీ నటుడు మాజీ ఎం.మురళీమోహన్ ఘనంగా సత్కరించారు. గురువారం ఆచంటలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్వీ రామారావు గ్రంథావిష్కరణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బుధవారం రాత్రి సత్కరించినట్లు తెలిపారు.

బాలోత్సవం బ్రోచర్ విడుదల



భీమవరంలో బాలోత్సవం బ్రోచర్ విడుదల చేసిన కమిటీ నాయకులు

భీమవరం: పట్టణంలో రెండు రోజులపాటు నిర్వహించే బాలోత్సవాన్ని అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. గురువారం పట్టణంలో బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30, 31 వ తేదీల్లో చింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాలలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పిల్లల్లో సాహిత్యం, కళల పట్ల అవగాహన, ఆసక్తి, నైపుణ్యం, సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహించడానికి భీమవరం పట్టణం, పరిసర ఆరు మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులతో బాలోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి సీహెచ్ పట్టాభిరామయ్య మాట్లాడుతూ 30న విద్యార్థులకు వివిధ రకాల పోటీలు 31న అకడమిక్ అంశాల్లో వ్యాస రచన, కవితా రచన, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, శాస్త్రీయ నృత్యం, అభ్యుదయ, దేశభక్తి, జానపద నృత్యాలు, కోలాటం వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య ప్రసాద్, పి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

వీరవాసరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భీమవరం పర్యటనను విజయవంతం చేయాలని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల ముఖ్య నాయకుల గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా దీవెన పథకానికి సంబంధించిన నగదును భీమవరంలో బటన్ నొక్కి జమ చేయడం మనందరికీ గర్వకారణమని వివరించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం, రైతులు, కార్మికులు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మనమంతా బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పోలిశెట్టి సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, సర్పంచ్ గెడ్డం భారతి, వైఎస్సార్ సీపీ నాయకులు నేతల జ్ఞాన సుందర్రాజు, నూకల కనకారావు, గెడ్డం భాస్కరరావు, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, వీరవల్లి శ్రీనివాసరావు ,కడలి శ్రీరాములు, కందుల సురేష్, చికిలే మంగతాయారు పాల్గొన్నారు.

సిద్ధాపురంలో పశు వైద్య శిబిరం



సిద్ధాపురంలో ఆవుకు వైద్యం చేస్తున్న డాక్టర్

ఆకివీడు: ఆకివీడు మండలం సిద్ధాపురం గ్రామంలో ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 65 పశువులకు గర్భకోశ, 37 పశువులకు సాధారణ వైద్యం అందజేశారు. సంబంధిత రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం లేగ దూడల అందాల పోటీలు నిర్వహించారు. మొదటి మూడు దూడలకు బహుమతులు అందజేశారు. శిబిరాన్ని లయన్ పీవీ రమణ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ జవహర్ హుస్సేన్ పాల్గొని మాట్లాడారు. రోజుల తరబడి పాలు ఇవ్వని, మేత తినని పశువులు, చర్మవ్యాధులతో బాధపడుతున్న పశువుల్ని గుర్తించి వైద్యం అందజేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ పళ్లెం అరుణ కుమారి, సర్పంచ్ చిగురుపాటి జయశీలుడు, ఎంపీటీసీ కిళ్లి రామకృష్ణ, పశుసంవర్ధక శాఖ ఏడీలు జనార్దనరావు, మల్లేశ్వరరావు, మండల పశువైద్యురాలు కె.భార్గవీ సత్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో మేలు

మొగల్తూరు: తుపాను కారణంగా దాళ్వా పనులు ఆలస్యం కావడంతో విత్తనం వెదజల్లే పద్ధతి పాటించాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. గురువారం మొగల్తూరులో ఆయన చేల వద్దకు వెళ్లి రైతులకు పలు సూచనలు అందజేశారు. మండలంలో సుమారు 2320 ఎకరాల్లో సాగు చేపడతారని అంచనా వేశామన్నారు. అందుకు 116 ఎకరాల్లో ఆకుమడులు అవసరం కాగా ఇప్పటివరకూ 30 ఎకరాల్లో మాత్రమే ఆకుమడి విత్తనాలు వేశారన్నారు. 120 రోజుల్లో పంట చేతికొచ్చే 1153, 1156 రకం విత్తనాలను వెదజల్లే పద్ధతి ఆచరిస్తే ఆకుమడితో ఉన్న కాలం కలిసి వస్తుందని చెప్పారు. విత్తన శుద్ధి ద్వారా తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న విత్తనాలు, పురుగు మందులతో పాటు సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

ఘనంగా పిల్లల క్రిస్మస్



ఎన్నార్పీ అగ్రహారంలో క్యారల్స్ నిర్వహిస్తున్న చిన్నారులు

ఉండి: మండలంలో ఎన్నార్పీ అగ్రహారం గ్రామంలో ట్రినిటీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో చిల్డ్రన్ క్రిస్మస్ వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. టీచర్స్ చెల్లు బోయిన సుధారాణి, ముత్యం శ్రీవల్లి పర్యవేక్షణలో క్రిస్మస్ తాత వేషధారణలో సండేస్కూల్ విద్యార్థులు గ్రామంలో క్యారల్స్ నిర్వహించారు. బైబిల్ వాక్యాలు చెబుతూ క్రీస్తు జన్మదిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం చర్చిలో పేరిష్ పాస్టర్ రెవరెండ్ వి.నెహ్రూ, అడిషనల్ పాస్టర్ రెవరెండ్ ఎం మార్కురాజు, సీఆర్ పి.కరుణాకరరావు ప్రార్థనలతో చిల్డ్రన్ క్రిస్మస్ కార్యక్రమాలను ప్రారంభించారు. విద్యార్థులు క్రిస్మస్ గీతాలను ఆలపించారు. పాస్టర్ గోడి గౌతమ్‌కుమార్ (ఏలూరు) మాట్లాడుతూ బాల్యం ప్రతి వ్యక్తికీ అమూల్యమైందన్నారు. చిన్నతనం నుంచీ క్రీస్తు ఉపదేశాలపై చిన్నారులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, పీసీసీ సభ్యులు, కోశాధికారి, కార్యదర్శి, స్త్రీల సమాజం, యూత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.7 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించినట్టు ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు. సుమారు 49 రోజులకు గానూ రూ7,98,056లు ఆదాయం లభించినట్టు ఆయన తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో నరసాపురం రాజగోపాల స్వామి ఆలయ అధికారి పులగం వేణుగోపాలరావు, సర్పంచ్ కొపనాతి పల్లయ్య, ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు, ధర్మకర్తలు పాల్గొన్నారు.